

ఆకట్టుకున్న 'మాబ్ ఆపరేషన్'

గోదావరిఖని: రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో నిర్వహించిన మాబ్ ఆపరేషన్ మాక్‌డ్రిల్ ప్రాక్టీస్ ఆకట్టుకుంది. జనసమూహాలను చెదరగొట్టడం తదితర అంశాలపై డ్రిల్ చేపట్టారు.



ట్రాఫిక్ ఏసీపీకి డీజీపీ ప్రశంస

గోదావరిఖని: రామగుండం ట్రాఫిక్ ఏసీపీ జె.నర్సింహులు డీజీపీ జితేందర్ నుంచి ప్రశంస పత్రం అందుకున్నారు. పరకాల సీఐగా పనిచేస్తున్న సమయంలో ఓ కేసును ఛేదించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
28.0/15.0

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతమవుతుంది. ఉదయం మంచు కురుస్తుంది. సాయంత్రం చలితీవ్రత పెరుగుతుంది.

ఉద్యోగం వదిలి.. సాగుకు కదిలి

- సంతృప్తినివ్వని సాఫ్ట్‌వేర్, ఇతర ప్రైవేటు ఉద్యోగాలు
- కోళ్ల పెంపకం, వ్యవసాయం చేస్తున్న పలువురు పట్టభద్రులు
- ఈ పనుల్లోనే మజా ఉందంటున్న వైనం
- ఆదర్శం.. ఉమ్మడి జిల్లావాసులు

డిగ్రీ, పీజీ వంటి ఉన్నత చదువులు చదివారు.. ఉద్యోగం రాలేదా అంటే.. మంచి ప్యాకేజీతో సాఫ్ట్‌వేర్, ఇతర ప్రైవేటు ఉద్యోగాలు వచ్చాయి.. కొన్నేళ్లు పని చేశారు.. కానీ, నెలవారీగా జీతం తీసుకునే ఆ జీవితం వారికి సంతృప్తినివ్వలేదు.. ఏం చేస్తే బాగుంటుందని తీవ్రంగా ఆలోచించారు.. అలా.. పలువురు వ్యవసాయం, కోళ్ల పెంపకం వైపు కదిలారు.. పంటలు పండిస్తూ, కోళ్లను పెంచుతూ ఆదాయం పొందుతూ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు.. ఈ పనుల్లోనే మజా ఉందని చెబుతున్నారు పలువురు ఉమ్మడి జిల్లావాసులు.

కోడిపిల్లల ఉత్పత్తికి ఇంక్యుబేటర్

రామగుండం: అంతర్గాం మండలంలోని రాయదండికి చెందిన పల్లె రాజుది నిరుపేద కుటుంబం. 2016లో ఉస్మానియా క్యాంపస్‌లో ఎంకాం చదివాడు. కొన్ని నెలలపాటు ప్రైవేటు ఉద్యోగం చేశాడు. దానితో సంతృప్తి చెందలేదు. సొంతంగా ఏదైనా పని చేసి, యువతకు ఉపాధి కల్పించాలనుకున్నాడు. 2017లో స్వగ్రామంలోనే అగ్రి గ్రీన్ ఫామ్స్ పేరిట తొలుత 10 కోళ్లు, 2 పుంజులతో నాటుకోళ్ల పెంపకం ప్రారంభించాడు. కృత్రిమంగా 2 వేల కోడిగుడ్ల నుంచి కోడిపిల్లలను ఉత్పత్తి చేసేలా ఇంక్యుబేటర్‌కు రూపకల్పన చేశాడు. తర్వాత నాటుకోడి పిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని ప్రారంభించాడు. 2018 నుంచి కోళ్ల ఫాంలు పెట్టుకునే రైతులను ప్రోత్సహిస్తూ శిక్షణనిస్తున్నాడు. రాజు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఐదుసార్లు ఉత్తమ యువ పౌల్ట్రీ రైతు అవార్డులతోపాటు 3 జాతీయ స్థాయి అవార్డులు అందుకున్నాడు. ఇప్పటివరకు దేశంలోని 19 రాష్ట్రాలకు నాటు కోడి పిల్లలు సరఫరా చేశాడు. 5 దేశాలకు నాటు కోడి పచ్చడి ఎగుమతి చేస్తున్నాడు. కడక్‌నాథ్, తెల్లరంగు చీమ, టర్కీ కోళ్లు, ఖజానా బాతులు, అమెరికన్ సిల్కీ కోళ్లు, కుందేళ్లు, అమెరికన్ జాతి పావురాలు, జర్మన్ షెపర్డ్ కుక్కలు పెంచుతున్నాడు.



రాజు(మధ్యలో ఉన్న వ్యక్తి)ను అభినందిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ (ఫైల్)

వరి, మొక్కజొన్న, పత్తి సాగు



మొక్కజొన్న చేనులో వరుణ్‌రెడ్డి

ఇల్లంతకుంట(మానకొండూర్): ఇల్లంతకుంట మండలంలోని ముస్కానిపేటకు చెందిన బద్దం వరుణ్‌రెడ్డి 2009లో ఎంసీఏ పూర్తి చేశాడు. తొమ్మిదేళ్లు హైదరాబాద్, బెంగళూరు, పుణేల్లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేశాడు. వ్యవసాయంపై ఆసక్తితో సాఫ్ట్‌వేర్ రంగాన్ని వదిలేసి, ఇంటికి వచ్చాడు. కుటుంబానికి 20 ఎకరాల వ్యవసాయ భూమి ఉండటంతో వరి, మొక్కజొన్న, పత్తి పంటలు సాగు చేస్తున్నాడు. డ్రిప్ ద్వారా మొక్కజొన్న పండిస్తున్నట్లు పేర్కొన్నాడు. వ్యవసాయంలో ఆనందం ఉందని, పనుల కోసం ట్రాక్టర్, హార్వెస్టర్ కొనుగోలు చేసినట్లు తెలిపాడు.

సేంద్రియ సాగు.. పశువుల పెంపకం

చొప్పదండి: పెద్దకుర్మపల్లికి చెందిన మావురం మల్లికార్జున్ రెడ్డి బీటెక్ చదివాడు. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ నెలకు రూ.లక్ష సంపాదించినా తృప్తినివ్వలేదు. రసాయనాలతో ఆహారం కలుషితమవడాన్ని గుర్తించి, సేంద్రియ వ్యవసాయం చేయాలనుకున్నాడు. విషయాన్ని ఎంసీఏ చదివి, ప్రైవేటు ఉద్యోగం చేసే తన భార్య సంధ్యకు చెప్పడంతో సరే అంది. ఇద్దరూ కలిసి స్వగ్రామం చేరుకున్నారు. 15 ఎకరాల్లో సేంద్రియ వ్యవసాయం చేస్తూ పశువులు, బావిలో చేపల పెంపకం చేపడుతున్నారు. మల్లికార్జున్‌రెడ్డి జాతీయ ఉత్తమ రైతు అవార్డు అందుకున్నాడు. గతేడాది ప్రధాని మోదీతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడాడు. ప్రస్తుతం 100 ఎకరాల్లో సేంద్రియ పద్ధతిలో పంటలు పండించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపాడు. సేంద్రియ వ్యవసాయంలో రైతులకు లాభాలు మెండుగా ఉంటాయని, భవిష్యత్‌లో మన దేశం ఆరోగ్యంగా ఉండాలంటే ఆరోగ్యకరమైన పంటలు పండించాలని సూచిస్తున్నాడు.



మొక్కజొన్న చేనులో మల్లికార్జున్‌రెడ్డి

సండే స్పెషల్



ఉస్మానియా వర్సిటీ



తెలంగాణ వర్సిటీ



శాతవాహన వర్సిటీ

మనోళ్లు.. వీసీలు

- సాధారణ స్థాయి నుంచి ఉన్నత పదవుల్లోకి..
- వైస్ చాన్స్‌లర్లుగా యూనివర్సిటీల పాలనలో ప్రత్యేక ముద్ర
- ఆదర్శంగా నిలిచిన ఉమ్మడి జిల్లావాసులు

8లో▸

ప్రజా పోరాటాలకు పెట్టింది పేరైన సిరిసిల్ల కాలానుగుణంగా శరవేగంగా పురోగమిస్తున్న జిల్లా కేంద్రం. అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్ననాటి నుంచే ప్రపంచం గుర్తించిన మేధావులకు జన్మనిచ్చిన నేల. పేద, వ్యవసాయ కుటుంబాల నుంచి వచ్చిన ఎంతోమంది ఉన్నత చదువులు చదివారు. రాష్ట్రంలోని ఉన్నత విద్యాసంస్థల్లో ప్రొఫెసర్లుగా పని చేశారు. ఉస్మానియా, అంబేడ్కర్, తెలుగు, కాకతీయ, శాతవాహన, తెలంగాణ వర్సిటీలకు వీసీలుగా బాధ్యతలు నిర్వహిస్తూ విద్యారంగంలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకువచ్చారు. వీరితో పాటు పలువురు ఉమ్మడి కరీంనగర్ జిల్లావాసులు కూడా ఉన్నారు. – సిరిసిల్ల కల్చరల్

రైతు సంక్షేమంపై ఊరూరా ప్రచారం

- మంత్రి శ్రీధర్‌బాబు

పెద్దపల్లిరూరల్: రైతు సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, వాటితో లబ్ధిపొందిన రైతులు, వివరాలతో కూడిన ఫ్లెక్సీలను ఊరూరా ఏర్పాటు చేయాలని మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం రాత్రి ధాన్యం కొనుగోళ్లు, రుణమాఫీ, సన్నరకాలకు బోనస్ చెల్లింపు తదితర అంశాలపై ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్యే విజయరమణారావుతో కలిసి కలెక్టర్ శ్రీహర్ష, అడిషనల్ కలెక్టర్ వేణు, అధికారులతో మంత్రి సమీక్షించారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను వివరించేలా సోషల్ మీడియాలో లబ్ధిదారులతో తీసిన వీడియో క్లిప్పింగ్‌లతో విస్తృతంగా ప్రచారం చేయాలని మంత్రి సూచించారు. డీఏవో ఆదిరెడ్డి, డీఎస్‌వో రాజేందర్, డీఎం శ్రీకాంత్‌రెడ్డి, డీఎంవో ప్రవీణ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



సమావేశమైన మంత్రి శ్రీధర్‌బాబు విప్ లక్ష్మణ్

బీజేపీ నాయకుల సంబురాలు

గోదావరిఖని: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అత్యధిక స్థానాల్లో విజయం సాధించడాన్ని స్వాగతిస్తూ స్థానిక ప్రధాన చౌరస్తాలో శనివారం సంబురాలు నిర్వహించారు. టపాసులు పేల్చి, మిఠాయిలు పంపిణీ చేశారు. బీజేపీకి మహారాష్ట్ర ప్రజలు ఏకపక్ష తీర్పు ఇచ్చారని నాయకులు అన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర సభ్యుడు రావుల రాజేందర్, నాయకులు మామిడి రాజేశ్, గాలిపెల్లి తిరుపతి, మామిడి సంపత్, అడ్డురి రాజేశ్, సల్ల వేణురెడ్డి, వడ్లూరి రాము, వడ్డేపల్లి సదానందం, కాసిపేట శ్రీనివాస్, మేకల సతీశ్, మహిళలు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి

నియోజకవర్గంలో బీజేపీని మరింత బలోపేతం చేస్తామని ఆ పార్టీ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి అన్నారు. ప్రధాన చౌరస్తాలో నిర్వహించిన విజయోత్సవాల్లో ఆమె మాట్లాడారు. నాయకులు మేర్గు హన్మంతుగౌడ్, పిడుగు కృష్ణ, జనగామ భూమన్న, కోడూరి రమేశ్, మిట్టపల్లి సతీశ్, కోమల మహేశ్, క్యాతం వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పెద్దపల్లిరూరల్: బీజేపీ పట్టణ, మండల శాఖ అధ్యక్షులు రాజ్‌గోపాల్, శ్రీనివాస్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో జెండా కూడలిలో సంబురాలు ఘనంగా జరుపుకున్నారు. మహారాష్ట్ర ఎన్నికల్లో బీజేపీ అత్యధిక స్థానాలు సాధించిందని నాయకులు అన్నారు. అనంతరం మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో నాయకులు దాడి సంతోష్, తంగెడ రాజేశ్వర్‌రావు, పోల్సాని సంపత్‌రావు, తిరుపతి, రమేశ్, రాకేశ్, ఉప్పు కిరణ్, సోడాబాబు, ముంజ రాజేందర్, పడాల శ్రీనివాస్, గుడ్ల సతీశ్ పాల్గొన్నారు.



పెద్దపల్లి జెండా కూడలివద్ద సంబురాల్లో నేతలు

న్యూస్‌రీల్

విచారణ చేపట్టాలి



మంత్రికి వినతి పత్రం ఇస్తున్న రాజ్‌కుమార్

సుల్తానాబాద్ రూరల్(పెద్దపల్లి): గర్రెపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ భవన నిర్మాణం కోసం కొనుగోలు చేసిన భూమి విషయంలో అవినీతికి పాల్పడిన పాలకవర్గంపై విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని జాతీయ బీసీ యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ రాజ్‌కుమార్ కోరారు. శనివారం మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు వినతిపత్రం అందించారు. తక్షణమే విచారణ చేపట్టి అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని అందులో పేర్కొన్నారు.

సజావుగా ధాన్యం సేకరణ

పెద్దపల్లిరూరల్: జిల్లాలో ధాన్యం సేకరణ సజావుగా సాగుతోందని అదనపు కలెక్టర్ వేణు తెలిపారు. కలెక్టరేట్‌లో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇప్పటివరకు 268 కేంద్రాల్లో 12,829 మంది రైతుల నుంచి 81,538 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని (దొడ్డు రకం 31, 701మెట్రిక్ టన్నులు, సన్న రకం 49,836 మె ట్రిక్‌టన్నులు) సేకరించినట్లు ఆయన వివరించారు.

సింగరేణిలో ఈఅండ్ఎం అధికారుల బదిలీ

గోదావరిఖని: సింగరేణి సంస్థలో ఈఅండ్ఎం అధికారులను బదిలీ చేస్తూ యాజమాన్యం శనివారం ఆదేశాలు జారీచేసింది. సంస్థ వ్యాప్తంగా 16మంది అధికారులకు స్థానచలనం కలిగింది. కె.సూర్యనారాయణరాజు(డీజీఎం), స్టోర్స్, కొత్తగూడెం నుంచి ఏరియా ఇంజినీర్ కొత్తగూడెం, లక్ష్మణమూర్తి(డీజీఎం) ఓసీ–2 స్టోర్స్ నుంచి ఏరియాస్టోర్స్, కొత్తగూడెం, ఎ.సురేశ్(డీజీఎం), పర్చేజ్ నుంచి ఏరియా స్టోర్స్, మందమర్రికి బదిలీ అయ్యారు. అదేవిధంగా రుక్మణ్‌సింగ్(ఎస్ఈ, పర్చేజ్ నుంచి సీఎస్పీ, మణుగూరు, పామర్ల పైడీశ్వర్(ఎస్ఈ) మందమర్రి నుంచి సోలార్, ఆర్జీ–3 , ఎ.నిరంజన్‌బాబు(ఎస్ఈ) సీఎస్పీ నుంచి పర్చేజ్, కొత్తగూడెం, బి.శ్రీనివాస్‌కుమార్(ఎస్ఈ) ఏఎల్పీ నుంచి కేటీకే–1, ప్రసాదరావు(ఎస్ఈ) కొత్తగూడెం నుంచి ఏపీహెచ్ఎంఎల్, పి.శ్రీనివాస్‌రెడ్డి(ఎస్ఈ) సోలార్‌ఆర్జీ–3 నుంచి ఖైరిగూడ ఓసీ , జి.శ్రీనివాసరావు(ఎస్ఈ) జీకేవోసీ నుంచి జేవీఆర్ ఓసీ , రాధాకృష్ణ(ఎస్ఈ) ఆర్కే–5 నుంచి కార్పొరేట్, ఇ.శ్రీధర్(ఎస్ఈ) కేటీకే–1 నుంచి ఓసీపీ–2, యు.సాయిశ్రావణ్(ఎస్ఈ) ఎస్ఆర్‌పీ–3 నుంచి జేవీఆర్ సీహెచ్‌పీకు బదిలీ అయ్యారు. అదేవిధంగా జి.దామోదర్‌కుమార్(ఎస్ఈ) సీఏసీ, శ్రీరాంపూర్ నుంచి ఎస్ఆర్‌పీ, ఓసీ–2, దాసరి సునీల్‌కుమార్(ఎస్ఈ) జీడీకే–11 నుంచి పర్చేజ్, కార్పొరేట్, జి.కృష్ణమూర్తి(ఎస్ఈ) ఏఎల్‌పీనుంచి జీడీకే–11కు బదిలీ అయ్యారు.

చిన్న కాళేశ్వరానికి రూ.571 కోట్లు

- నీటి పారుదల శాఖ సమీక్షలో నిర్ణయం

మంథని: దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో చేపట్టిన చిన్న కాళేశ్వరం ఎత్తిపోతల పథకం పూర్తికి ప్రభుత్వం రూ.571 కోట్లు కేటాయించింది. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన నీటిపారుదల శాఖ సమీక్షలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు పాల్గొన్నారు. ఇందులో తీసుకున్న నిర్ణయంతో సుమారు 17 ఏళ్ల తర్వాత ప్రాజెక్టు నిర్మాణం పూర్తికి అవకాశం లభించింది. నియోజకవర్గంలోని మహదేవపూర్ మండలం బీరాసాగర్ వద్ద 2007లో ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారు. 63 గ్రామాల్లోని 45 వేల ఎకరాలకు సాగునీరు అందించాలని లక్ష్యంగా నిర్దేశించారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కాలువలను కూడా మరమ్మతు చేయాలని నిర్ణయించారు. చిన్నకాళేశ్వరంతోపాటు కాలువల పూడికతీతతో సాగునీటి కష్టాలు తీరుతాయి.



అధికారులతో సమీక్షిస్తున్న మంత్రులు

నర్సింగ్ తరగతులకు సన్నద్ధం

- మొత్తం సీట్లు 60.. సుముఖత వ్యక్తం చేసింది 54 మంది
- ఖాళీ సీట్ల భర్తీకి నేటినుంచి వెబ్ కౌన్సెలింగ్

కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖనిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)తోపాటు సింగరేణి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(సిమ్స్)కు అనుబంధంగా రాష్ట్ర ప్రభుత్వం రామగుండం ప్రభుత్వ మహిళా నర్సింగ్ కాలేజీ ఏర్పాటుకు ఉత్తర్వులను జారీ చేసింది. దీంతో ఈఏడాది డిసెంబర్ మొదటి వారం నుంచే తరగతులు ప్రారంభించడానికి సన్నద్ధమవుతున్నారు. ఇందుకోసం యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు చేపడుతున్నారు. సిమ్స్ కాలేజీ, జీజీహెచ్‌కి సమీపంలోనే నర్సింగ్ కాలేజీ నిర్వహణకు ప్రణాళిక రూపొందించారు.

ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ నియామకం..

- జగిత్యాల నర్సింగ్ కాలేజీలోని అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రసూనను రామగుండం నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా, సిరిసిల్ల నర్సింగ్ కాలేజీ ఫ్యాకల్టీ సుశీలను రామగుండం వైస్ ప్రిన్సిపాల్‌గా నియమించారు. మిగతా ఫ్యాకల్టీలతో పాటు సిబ్బందిని నియమించాల్సి ఉంది. జీజీహెచ్‌లో విధులు నిర్వహిస్తూ, ఎమ్మెస్సీ నర్సింగ్ పూర్తిచేసిన నర్సింగ్ ఆఫీసర్లను రామగుండం నర్సింగ్ కాలేజీకి పదోన్నతిపై ఫ్యాకల్టీలుగా నియమించే అవకాశం ఉందని తెలుస్తోంది.

రూ.26కోట్లు మంజూరు..

- రామగుండం ప్రభుత్వ నర్సింగ్ కాలేజీ కోసం ప్రభుత్వం రూ.26 కోట్లు మంజూరు చేస్తూ శుక్రవారం జీవో జారీ చేసింది. ఈ నిధులతో కాలేజీ కోసం కొత్త భవన నిర్మాణంతోపాటు ఫర్నీచర్ తదితర సామగ్రిని సమకూర్చే బాధ్యతలను తెలంగాణ రాష్ట్ర మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్(టీజీ ఎంఎస్ఐడీసీ)కి అప్పగించారు.

కేటాయించిన 60 సీట్లు..

- కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీకి అనుబంధంగా కొనసాగే రామగుండం నర్సింగ్ కాలేజీకి 60 సీట్లు కేటాయించారు. మొదటి సంవత్సరంలో చేరడానికి 55 మంది విద్యార్థినులు ఇప్పటికే రామగుండం కాలేజీని ఎంచుకోగా, ఒకరు మినహా 54 మంది ప్రవేశాలకు సుముఖత వ్యక్తం చేస్తూ రిపోర్టు చేశారు. ఆదివారం నుంచి వెబ్ కౌన్సెలింగ్ ద్వారా నచ్చిన నర్సింగ్ కాలేజీని ఎంచుకోవడానికి మరోసారి అవకాశం కల్పించారు. దీంతో మిగిలిన సీట్లు కూడా భర్తీ అవుతాయని అధికారులు భావిస్తున్నారు.

స్థలం కోసం పరిశీలన..

- నర్సింగ్ కాలేజీ నిర్వహణకు అవసరమైన స్థలం కోసం స్థానిక ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, కలెక్టర్ కోయ శ్రీహర్షతోపాటు అధికారులు అన్వేషణ ప్రారంభించారు. కాలేజీకి సుమారు ఐదెకరాలు అవసరం ఉంటుందని భావిస్తున్నారని తెలిసింది. ఇందుకోసం సిమ్స్ సమీపంలోని సింగరేణి స్థలం అనుకూలంగా ఉంటుందని భావిస్తున్నారు. ఈ స్థలం ఇవ్వడానికి సింగరేణి అధికారులు ముందుకురాకపోతే.. సమీపంలోనే మరో ప్రభుత్వ స్థలాన్ని కేటాయించేలా ప్రణాళిక తయారు చేస్తున్నారని సమాచారం.

ఒకేచోట తరగతులు.. హాస్టల్..

- భవన నిర్మాణం పూర్తయ్యేంత వరకూ గోదావరిఖని శారదానగర్‌లో సిమ్స్ కాలేజీ విద్యార్థుల హాస్టల్ కోసం ఉపయోగించిన సింగరేణి భవనాన్ని తాత్కాలికంగా తరగతుల నిర్వహణకు ఉపయోగించడానికి చర్యలు చేపట్టారు. ఈ భవనంలోనే గ్రౌండ్ ఫ్లోర్‌లో క్లాసు రూమ్‌లు, పైఅంతస్తులో హాస్టల్ కోసం ప్రత్యేకంగా గదులను కేటాయించారు. ఒక్కో గదిలో ఆరు బెడ్‌లను కూడా అందుబాటులోకి తీసుకొచ్చారు. వాష్‌రూమ్, స్నానాల గదులు, తాగునీరు, విద్యుత్, సీసీ కెమెరాలు, శానిటేషన్ తదితర వాటిపై ప్రత్యేక దృష్టి సారించారు.



రామగుండం నర్సింగ్ కాలేజీ కోసం తాత్కాలికంగా కేటాయించిన భవనం ఇదే..

స్థల పరిశీలన చేస్తున్నాం

రామగుండంలో ప్రభుత్వ మెడికల్, నర్సింగ్ కాలేజీల ఏర్పాటు శుభపరిణామం. ప్రభుత్వ నర్సింగ్ కాలేజీకి అనుకూలమైన స్థల పరిశీలన చేస్తున్నాం. సిమ్స్ సమీపంలోనే సింగరేణి స్థలాన్ని కేటాయించేలా ఉన్నతాధికారులతో చర్చిస్తున్నాం. ఇది ఇవ్వకుంటే మరో స్థలం కోసం అన్వేషిస్తాం.

– మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, ఎమ్మెల్యే

తరగతుల నిర్వహణపై దృష్టి

నర్సింగ్ కాలేజీలో ఫస్టియర్ బోధన తరగతుల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి పెట్టాం. నర్సింగ్ గర్ల్స్ కాలేజీకి 60 సీట్లు కేటాయించగా 55 మంది చేరడానికి ముందుకు వచ్చారు. ఒకరు తప్ప అందరూ రిపోర్టు చేశారు. ఆదివారం నుంచి వెబ్ కౌన్సెలింగ్ నిర్వహిస్తారు.

– ప్రసూన, ప్రిన్సిపాల్, నర్సింగ్ కాలేజీ

మనోళ్లు.. వీసీలు

జర్మనీలో ప్రొఫెసర్.. రమేశ్‌బాబు


రమేశ్‌బాబు

చెన్నమనేని రమేశ్‌బాబు మాజీ ఎమ్మెల్యే రాజేశ్వర్‌రావు కుమారుడు. ఉన్నత విద్యాభ్యాసం కోసం జర్మనీ వెళ్లారు. లీప్‌జిగ్‌లో వ్యవసాయ రంగంలో పీజీ చేసి, అనంతరం హంబోల్ట్ విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ పొందారు. అక్కడే ప్రొఫెసర్‌గా పని చేసి, 2009లో వేములవాడ వచ్చి, తొలిసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. తర్వాత టీఆర్ఎస్ నుంచి 2010, 2014, 2018లో వరుసగా శాసనసభ్యుడిగా విజయం సాధించారు.

ఎస్‌యూ తొలి వీసీ.. ఇక్బాల్ అలీ


ఇక్బాల్ అలీ

శాతవాహన యూనివర్సిటీ తొలి వీసీ ప్రొఫెసర్ మహమ్మద్ ఇక్బాల్ అలీ. ఆయన స్వగ్రామం తంగళ్లపల్లి మండలంలోని తాడూరు. 1954 ఆగస్టు 10న జన్మించారు. ఉద్యోగ రీత్యా వరంగల్, కరీంనగర్‌లో స్థిరపడ్డారు. కరీంనగర్‌లోని మంకమ్మతోట ధన్గర్‌వాడీ హైస్కూల్లో పదోతరగతి, ఎస్సారార్ డిగ్రీ కళాశాలలో డిగ్రీ పూర్తి చేశారు. 14 ఏళ్లు ఎకనామిక్స్ ప్రొఫెసర్‌గా, మరో 19 ఏళ్లు కాకతీయ వర్సిటీలో వివిధ హోదాల్లో బాధ్యతలు నిర్వహించారు. కేయూ ఎకనామిక్స్ విభాగాధిపతిగా, పీజీ కాలేజ్ ప్రిన్సిపాల్‌గా పని చేసిన ఆయన అనేక ప్రామాణిక పుస్తకాలకు సంపాదకత్వం వహించారు. ఔత్సాహిక పరిశోధకులకు మార్గనిర్దేశం చేశారు.

లింగమూర్తి, వీరారెడ్డి, అనంతస్వామి..


లింగమూర్తి


వీరారెడ్డి


అనంతస్వామి

హుస్నాబాద్‌కు చెందిన ప్రొ. ఎన్.లింగమూర్తి కాకతీయ, తెలంగాణ వర్సిటీలకు వీసీగా పని చేశారు. శాతవాహనకు వీసీగా చేసిన కడారు వీరారెడ్డిది కొడిమ్యాల మండలం కట్టకింది గోపాల్‌రావుపల్లి. తల్లిదండ్రులు యశోద-పెద్దమల్లారెడ్డి. వ్యవసాయ కుటుంబం. కరీంనగర్‌కు చెందిన ప్రొ.జె.అనంతస్వామి పేద కుటుంబంలో పుట్టారు. ఉస్మానియా వర్సిటీకి వీసీగా చేశారు.

సెంట్రల్ వర్సిటీ.. హనుమంతరావు


హనుమంతరావు

కోనరావుపేట మండలం నాగారానికి చెందిన డాక్టర్ చెన్నమనేని హనుమంతరావు 1929 మే 15న జన్మించారు. ఉస్మానియా యూనివర్సిటీలో ఎంఏ ఎకనామిక్స్, యూనివర్సిటీ ఆఫ్ చికాగో నుంచి పీహెచ్‌డీ పూర్తి చేశారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు ఈయన క్లాస్‌మేట్. ఆర్థిక సంస్కరణలపై అధ్యయనం చేశారు. ప్రణాళికా సంఘం సభ్యుడిగా, నేషనల్ అడ్వైజరీ కౌన్సిల్ సభ్యుడిగా, గవర్నర్‌తో ప్రమేయం లేకుండా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి 2012–14 వరకు చాన్స్‌లర్‌గా పని చేశారు. 2014లో రాజీవ్‌గాంధీ సద్భావన పురస్కారం అందుకున్నారు. భారత ప్రభుత్వం పద్మభూషణ్ అవార్డుతో సత్కరించింది. రిజర్వ్ బ్యాంక్ మాజీ డైరెక్టర్‌గా సేవలందించారు. మాజీ ఎమ్మెల్యే, దివంగత సీహెచ్.రాజేశ్వర్‌రావు, మహారాష్ట్ర మాజీ గవర్నర్ సీహెచ్.విద్యాసాగర్ రావు ఈయన సోదరులే.



సార్వత్రిక విద్య.. రాంరెడ్డి


రాంరెడ్డి

చందుర్తి మండలంలోని బండపెల్లికి చెందిన గడ్డం రాంరెడ్డి 1929 డిసెంబర్ 4న జన్మించారు. దేశంలో సార్వత్రిక విద్యను ప్రవేశపెట్టిన మేధావి. ఎంఏ పొలిటికల్ సైన్స్‌తోపాటు పీహెచ్‌డీ చేశారు. 1977 వరకు ఉస్మానియాలో ప్రొఫెసర్‌గా పని చేశారు. ఈయన నివేదిక ఆధారంగానే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం హైదరాబాద్‌లో 1982లో దేశంలోనే తొలి సార్వత్రిక విశ్వవిద్యాలయాన్ని బీఆర్.అంబేడ్కర్ పేరిట స్థాపించింది. దీనికి రాంరెడ్డి తొలి వీసీ. అప్పటి కేంద్ర ప్రభుత్వం ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీని స్థాపించి, ఆయననే వీసీగా నియమించింది. అనంతరం యూజీసీ చైర్మన్‌గా పని చేశారు. బంగ్లాదేశ్‌లో ఏర్పాటు చేసిన ఓపెన్ యూనివర్సిటీకి సలహాదారుగా నియమితులయ్యారు. ఉస్మానియా విశ్వవిద్యాలయ దూరవిద్య విభాగానికి ఆయన పేరే పెట్టారు. జూలై 2, 1995లో లండన్‌లో మరణించారు.

అంబేడ్కర్, తెలుగు వర్సిటీలు.. సినారె


నారాయణరెడ్డి

చందుర్తి మండలం హన్మాజీపేటకు చెందిన డాక్టర్ సి.నారాయణరెడ్డి 1931 జూలై 29న జన్మించారు. తెలుగు సాహిత్య ప్రక్రియలన్నింటిలో రాణించి, మహాకవిగా ఎదిగారు. పద్మశ్రీ, పద్మభూషణ్, కళాప్రపూర్ణ, కేంద్ర సాహిత్య అకాడమీతోపాటు ప్రతిష్టాత్మక జ్ఞానపీఠ అవార్డు అందుకున్నారు. ఉస్మానియాలో ఎంఏ తెలుగు పూర్తయ్యాక సికింద్రాబాద్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ, నిజాం కాలేజీ, ఉస్మానియా వర్సిటీలో ఆచార్యుడిగా పని చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయానికి, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి వీసీగా బాధ్యతలు నిర్వర్తించారు. అధికార భాషా సంఘం అధ్యక్షుడిగా, సాంస్కృతిక మండలి అధ్యక్షుడిగా, సాంస్కృతిక వ్యవహారాల సలహాదారుగా పని చేశారు. 1997లో రాజ్యసభ సభ్యుడిగా ప్రజాసేవలో తరించారు.

శాతవాహన.. మల్లేశం


మల్లేశం

సినారె స్వగ్రామం హన్మాజీపేటలో సంకసాల పోచయ్య-రాములమ్మ దంపతులకు రెండో సంతానంగా జన్మించారు ప్రొఫెసర్ మల్లేశం. సిరిసిల్ల సోషల్ రెసిడెన్షియల్ హాస్టల్లో ఉండి, 10వ తరగతి పూర్తి చేశారు. బతుకుదెరువు కోసం దుబాయ్ వెళ్లిన సోదరుడు రాములు పంపిన డబ్బుతో హైదరాబాద్‌లో ఇంటర్, బీఎస్సీ, పీజీ చదివారు. ఉస్మానియాలో ఎంఫిల్, ఇంటర్నేషనల్ జర్మనీ ఫెలోషిప్‌తో జర్మనీ బెర్లిన్ యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పూర్తి చేశారు. హైదరాబాద్‌లోని ఆర్ట్స్, నిజాం, ఉస్మానియా ఆర్ట్స్ కాలేజీల్లో ప్రొఫెసర్‌గా, ప్రిన్సిపాల్‌గా పని చేశారు. అనంతరం ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్‌గానూ సేవలందించారు. 2021 నుంచి మూడేళ్లపాటు శాతవాహన వర్సిటీ వీసీగా కొనసాగారు.

తెలుగు వర్సిటీ.. కిషన్‌రావు


కిషన్‌రావు

ప్రొఫెసర్ తంగెడ కిషన్‌రావు స్వగ్రామం వరంగల్ అర్బన్ జిల్లా పరిధి ఎల్కతుర్తి మండలం జీలుగుల గ్రామం. కానీ, ఆయన ముస్తాబాద్ మండలం గూడెం గ్రామంలో తన మేనమామ ఇంట్లో జన్మించారు. బాల్యంలో కొంతకాలం ఇక్కడే విద్యాభ్యాసం చేశారు. అనంతరం తల్లిదండ్రుల వద్ద పెరిగారు. ఉస్మానియా వర్సిటీలో తెలుగు ప్రొఫెసర్‌గా ఉద్యోగ విరమణ చేశారు. అనంతరం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి వీసీగా సేవలందించారు.

తెలుగు వర్సిటీ.. భూమయ్య


భూమయ్య

అనుమాండ్ల భూమయ్య చొప్పదండిలో సాధారణ చేనేత కుటుంబంలో పుట్టారు. తల్లిదండ్రులు శాంతమ్మ-లస్మయ్య. ఏడుగురు తోబుట్టువుల్లో ఆయన మూడో సంతానం. భూమయ్య 11వ తరగతి వరకు చొప్పదండిలో చదివారు. హెడ్మాస్టర్ జనార్దన్‌రెడ్డి ప్రోత్సాహంతో చదువు కొనసాగించారు. జగిత్యాలలో డిగ్రీ చదివే రోజుల్లో కోవెల సంపత్‌కుమారాచార్య ప్రోత్సాహంతో తెలుగుపై ఆసక్తి పెంచుకొని, ఎంఏ పూర్తి చేశారు. తెలుగు వర్సిటీకి వీసీగా సేవలందించారు.

టీఎంసీ మాజీ రిజిస్ట్రార్.. హనుమంతరావు


హనుమంతరావు

చందుర్తి మండలంలోని మల్యాలకు చెందిన చెన్నమనేని నారాయణరావు-రంగనాయకమ్మ దంపతులకు మారుడు హనుమంతరావు. సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రిలో 1978 నుంచి రెండేళ్లపాటు డాక్టర్‌గా సేవలందించారు. వేములవాడ, చందుర్తి, ఎల్కతుర్తి, కరీంనగర్‌లలో సివిల్ సర్జన్‌గా పని చేశారు. 800 పేజీల మహాభారతాన్ని 150 పేజీలకు కుదించి, రచించడంతో పాటు అందరికీ ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. వికాస తరంగిణిలో సభ్యుడిగా ఆధ్యాత్మిక సేవలందిస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆయనను తెలంగాణ రాష్ట్ర మెడికల్ కౌన్సిల్(టీఎంసీ)కు రిజిస్ట్రార్‌గా నియమించింది.

క్లుప్తంగా

ప్రభుత్వ ఆస్పత్రిలో హైరిస్క్ ఆపరేషన్


ఆపరేషన్ చేసిన వైద్యులు

పెద్దపల్లిరూరల్: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో శనివారం వృద్ధురాలి(96)కి ఆర్థోపెడిక్ వైద్యులు ఆపరేషన్ విజయవంతంగా పూర్తిచేశారు. గంగారం గ్రామానికి చెందిన పందిర్ల బాలమ్మ తొంటి ఎముక విరగడంతో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చేరింది. డాక్టర్ శ్రీనివాసరెడ్డి, శౌరయ్య, వైద్యబృందం హైరిస్క్ అని భావించినా.. ఆపరేషన్ విజయవంతంగా పూర్తిచేశారు. దీంతో వారిని కలెక్టర్ శ్రీహర్ష అభినందించారని సూపరింటెండెంట్ శ్రీధర్ తెలిపారు.

సర్వే డాటా నమోదు ప్రక్రియ తనిఖీ

పాలకుర్తి(రామగుండం): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో చేపట్టిన సమగ్ర సర్వే డాటా ఆన్‌లైన్ నమదు తీరును జెడ్పీ సీఈవో నరేందర్, డీపీవో వీరబుచ్చయ్య, డీఎల్‌పీవో వేణుగోపాల్ శనివారం వేర్వేరుగా తనిఖీ చేశారు. ఎంట్రీ వివరాల గురించి ఎంపీడీవో శశికళను అడిగి తెలుసుకున్నారు. అధికారులు, డాటా ఎంట్రీ ఆపరేటర్లకు పలు సూచనలు చేశారు. మండల పంచాయతీ అధికారి సుదర్శన్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలున్నాయా?


పొలంబాటలో అధికారులు, రైతులు

ధర్మారం(ధర్మపురి): ట్రాన్స్‌కో ఆధ్వర్యంలో శనివారం రచ్చపల్లిలో విద్యుత్ అధికారులు పొలంబాట నిర్వహించారు. సూపరింటెండెంట్ ఇంజినీర్ కంకటి మాధవరావు ఆధ్వర్యంలో పెద్దపల్లి డీఈఈ తిరుపతి, డీఈ(టెక్నికల్) రవి, విజయగోపాల్‌సింగ్, ఏడీఈ మహిపాల్‌రెడ్డి, సెక్షన్ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ల పనితీరు తనిఖీ చేశారు. ఆ తర్వాత రైతులను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ సంబంధిత సమస్యలుంటే టోల్ ఫ్రీ నంబరు 1912కు సమాచారం అందించాలని ఆయన సూచించారు. 127 స్తంభాల లైస్‌లైన్ సరిచేశామని వివరించారు.

ప్రజాపాలన విజయోత్సవ సభ వాయిదా

మంథని: పట్టణంలో ఆదివారం చేపట్టిన ప్రజాపాలన విజయోత్సవ సభను సోమవారానికి వాయిదా వేసినట్లు పౌర సంబంధాల జిల్లా ఇన్‌చార్జి అధికారి జగన్ శనివారం తెలిపారు. పట్టణ ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

నేడు పత్తిపాకకు మంత్రి శ్రీధర్‌బాబు

ధర్మారం(ధర్మపురి): పత్తిపాక శివారులో చేపట్టే రిజర్వాయర్ స్థల పరిశీలనకు మంత్రి శ్రీధర్‌బాబు ఆదివారం రానున్నారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి తెలిపారు. పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్, పెద్దపల్లి, రామగుండం ఎమ్మెల్యేలు హాజరవుతారన్నారు.

ప్రజలకు సేవలు అందించాలి


పరిశ్రమల ప్రతినిధులతో కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లిరూరల్: పరిశ్రమలు ఉన్న గ్రామాలు, మున్సిపల్ ఏరియా పరిధిలోని ప్రజలకు కనీస వసతులను కల్పించే బాధ్యతలను యాజమాన్యాలు తీసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. కలెక్టరేట్‌లో అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీతో కలిసి ఎన్టీపీసీ, సింగరేణి, ఆర్ఎఫ్‌సీఎల్, కేశోరాం సిమెంట్ కర్మాగార ప్రతినిధులతో శనివారం ఆయన సమావేశమయ్యారు. పారిశ్రామిక ప్రాంతంలోని గ్రామాలు, మున్సిపల్ ప్రజలకు కనీస వసతులు కల్పించాలన్నారు. పారిశుధ్యం మెరుగుపర్చేందుకు, తాగునీటి సరఫరాకు, వీధిదీపాల ఏర్పాటుకు సహకరించాలని సూచించారు. రామగిరి మండలం సెంటినరీ కాలనీలో తాగునీటి సరఫరా పనులకు ప్రతిపాదనలు ఇవ్వాలని మిషన్‌భగీరథ ఈఈని ఆదేశించారు. డీపీవో వీరబుచ్చయ్య ఉన్నారు.

28 వరకు ప్రత్యేక ఓటరు నమోదు

సుల్తానాబాద్(పెద్దపల్లి): జిల్లాలోని అర్హులైన యువత ఓటరు జాబితాలో తమ పేర్లు నమోదు చేసుకునేందుకు ఈనెల 28వ తేదీ వరకు అధికారులు అవకాశం కల్పించారు. మరోవైపు.. ఈనెల 23, 24వ తేదీల్లోనూ పోలింగ్ కేంద్రాల్లో దరఖాస్తులు స్వీకరించేందుకు చర్యలు తీసుకున్నారు. ఈమేరకు అదనపు కలెక్టర్ వేణు అన్ని ఏర్పాట్లు చేశారు. జిల్లావ్యాప్తంగా ఉన్న 18ఏళ్ల వయసు నిండిన యువతి ,యువకులు సమీప బీఎల్వోల వద్దకు వెళ్లి తమ తమ పేర్లు నమోదు చేసుకోవాల్సి ఉంది. ఇందుకోసం పదో తరగతి జిరాక్స్, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలను దరఖాస్తుకు జతచేయాలి. కొత్తగా ఓటరు నమోదుకు ఫారం 6, అభ్యంతరాల కోసం ఫారం 7, మార్పులు- చేర్పుల కోసం ఫారం 8లో వివరాలు నమోదు చేయాలి. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లోనూ అధికారులు దరఖాస్తులు స్వీకరిస్తారు.

ఏసీపీతో సెక్యూరిటీ జీఎం భేటీ

గోదావరిఖని: సింగరేణి సెక్యూరిటీ జీఎం లక్ష్మీనారాయణ శనివారం గోదావరిఖని ఏసీపీ రమేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేశారు. సంస్థకు సంబంధించిన భద్రత, ఆస్తుల పరిరక్షణలో సింగరేణి సెక్యూరిటీ విభాగానికి సహకరించాలని కోరారు. ఆయన వెంట సీనియర్ సెక్యూరిటీ అధికారి వీరారెడ్డి, జూనియర్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్‌అక్బర్‌లీ తదితరులు ఉన్నారు.

రామగుండం అభివృద్ధికి రూ.280 కోట్లు

• ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: రామగుండం నియోజకవర్గ అభివృద్ధికి రూ.280 కోట్లు మంజూరైయ్యాయని ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎస్టీపీల నిర్మాణానికి రూ.వంద కోట్లు, గ్రామీణ రోడ్ల కోసం రూ.వంద కోట్లు, డీఎంఎఫ్‌టీ నుంచి రూ.20 కోట్లు, ఈజీఎస్ ద్వారా రూ.4 కోట్లు మంజూరయ్యాయని ఆయన వివరించారు. వీటితో పనులు ప్రారంభించామని అన్నారు. రూ.10 వేల కోట్లతో విద్యుత్ ప్లాంట్ నిర్మిస్తామన్నారు. మెడికల్ కళాశాలకు రూ.140 కోట్లు, లిఫ్ట్ ఇరిగేషన్‌కు రూ.360 కోట్లు మంజూరు అయినట్లు తెలిపారు. రామగుండంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి, అండర్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.60 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించామని అన్నారు. నగర మేయర్ బంగి అనిల్‌కుమార్, నాయకులు బొంతల రాజేశ్, మహంకాళి స్వామి, ముస్తాఫా, పెద్దెల్లి ప్రకాశ్, గట్టు రమేశ్ పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతికి పెద్దపీట

మహిళల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే ఠాకూర్ అన్నారు. నియోజకవర్గంలోని 235మంది లబ్ధిదారులకు రూ.2.35కోట్ల విలువైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఆయన అందజేసి మాట్లాడారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

రామగుండాన్ని అభివృద్ధి చేస్తా

రామగుండం: విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలకు నిలయమైన, రాముడు-సీతాదేవి నడయాడిన నేలగా ప్రసిద్ధి చెందిన రామగుండాన్ని చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించేలా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. బైపాస్ రోడ్డులో ఇటీవల వెలుగుచూసిన హనుమాన్ రాతివిగ్రహం ఎదుట మక్కాన్‌సింగ్ - మనాలి దంపతులు శనివారం సంప్రోక్షణ, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. ఇక్కడ హనుమాన్ భారీ విగ్రహం, కొండపైకి రోడ్డు నిర్మించి రామునిగుండాలు, శ్రీరామపాదక్షేత్రం, గోదావరి నది, ఓపెన్‌కాస్టు అందాలను వీక్షించేలా చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు.

27న ఉద్యమకారుల పాదయాత్ర


అమరవీరులకు నివాళి అర్పిస్తున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: తెలంగాణ రాష్ట్ర సాధనకోసం ఉద్యమించిన వారిని గుర్తించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ ఈనెల 27న చేపట్టిన విజయసంకల్ప మహాపాదయాత్రను విజయవంతం చేయాలని ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కన్వీనర్ గుండేటి ఐలయ్య కోరారు. స్థానిక అమరవీరుల స్థూపం వద్ద శనివారం అమరులకు నివాళి అర్పించి మాట్లాడారు. కరీంనగర్‌లోని అమరవీరుల స్థూపం వద్ద ప్రారంభమయ్యే పాదయాత్ర వేములవాడకు చేరుకుంటుందన్నారు. అనంతరం రాజరాజేశ్వర స్వామికి మొక్కులు సమర్పిస్తామని పేర్కొన్నారు. నాయకులు పిడుగు కృష్ణ, తాడూరి శ్రీమాన్, చంద్రకళ, జ్యోతిరెడ్డి, సదాశివ, బింగిరాజు, లలిత ఠాగూర్, సీతక్క, లక్ష్మి, కళావతి, హరిత, బూర్ల ధనుంజయ, మారం మల్లేశం, సంజీవ్, సమ్మయ్య, మల్లయ్య, భాస్కర్, శ్రీనివాస్, తిరుపతి, సందీప్ తదితరులు ఉన్నారు.

‘ప్రజాభిప్రాయ సేకరణను అడ్డుకుంటాం’


మాట్లాడుతున్న కార్పొరేటర్లు, నాయకులు

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ ప్రాంతంలో 2,400 విద్యుత్ ప్లాంట్ నిర్మాణంపై ఈనెల 29న చేపట్టే ప్రజాభిప్రాయ సేకరణను అడ్డుకుంటామని బీఆర్ఎస్ కార్పొరేటర్లు కుమ్మరి శ్రీనివాస్, ఎన్వీ రమణారెడ్డి, కల్వచర్ల కృష్ణవేణి, బాదె అంజలి దేవి, బీఆర్ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి బుర్ర శంకర్‌గౌడ్ హెచ్చరించారు. స్థానిక ఆటోనగర్‌లో శనివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు ద్వారా వాయు కాలుష్యం పెరిగి ప్రజలు క్యాన్సర్, శ్వాసకోశ సంబంధిత వ్యాధులకు గురవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. అయినా, విద్యుత్ ప్లాంట్లలో నిర్వాసితులకు ఉద్యోగ నియామకాల్లో అవకాశం కల్పించడం లేదని, స్థానికేతరులకు అవకాశం కల్పించడాన్ని నిరసిస్తూ ఈనెల 27, 28 తేదీల్లో మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆధ్వర్యంలో బైక్ యాత్ర చేపడతామని అన్నారు. సమావేశంలో నాయకులు అనిల్‌రావు, కేవీ చందు, ఒల్లాల మల్లేశ్, దేవేందర్, శేఖర్ పాల్గొన్నారు.



ఆకట్టుకున్న మాక్‌డ్రిల్

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): అగ్నిప్రమాదాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలు, అప్రమత్తత తదితర అంశాలపై రామగుండం ఎరువుల కర్మాగారం అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయంలో శనివారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. రెస్క్యూ అధికారులు, సిబ్బంది సీజీఎం ఉదయ్ రాజహంస పర్యవేక్షణలో ఈకార్యక్రమం చేపట్టారు. సీజీఎం మాట్లాడుతూ కర్మాగారంలో రక్షణ చర్యలు పాటిస్తూ ఉత్పత్తి చేస్తున్నామన్నారు. ప్రమాదాలు సంభవిస్తే తీసుకోవాల్సిన నియంత్రణ చర్యలపై సిబ్బంది పనితీరు బాగుందని అన్నారు.

చేతికందిన కొడుకు కానరాని లోకాలకు..

• కన్నీరుమున్నీరవుతున్న తల్లిదండ్రులు


అవినాష్ (ఫైల్)

వెల్గటూర్ (ధర్మపురి): చేతికందిన కొడుకు తమకు ఆసరాగా ఉంటాడనుకున్న సమయంలో రోడ్డు ప్రమాదం ఆ కుటుంబాన్ని చిన్నాభిన్నం చేసింది. ఒక్కగానొక్క కొడుకు దూరమైన ఆ కన్నవారి కన్నీళ్లు తుడిచేవారు లేకుండా పోయారు. పోలీసులు, స్థానికుల వివరాలు.. పెద్దపెల్లి జిల్లా పాలకుర్తి మండలం కుక్కలగూడూర్‌కు చెందిన నల్లపు అవినాష్ (19), బడుగు సాగర్, కుదిరె సాగర్ శుక్రవారం రాత్రి వ్యక్తిగత పనిమీద ద్విచక్రవాహనంపై ధర్మపురి మండలం రాయపట్నం వైపు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో వెల్గటూర్ మండలం కొత్తపల్లి స్టేజీవద్దకు రాగా ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ ఎటువంటి సిగ్నల్ ఇవ్వకుండా హఠాత్తుగా బైక్‌కు ఎదురుగా తిప్పడంతో ట్రాక్టర్ ట్రాలీ బైక్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు చికిత్స నిమిత్తం క్షతగాత్రులను కరీంనగర్, జగిత్యాల ఆస్పత్రులకు తరలించారు. జగిత్యాలలో చికిత్స పొందుతున్న నల్లపు అవినాష్ మృతిచెందగా, బడుగు సాగర్ పరిస్థితి విషమంగా ఉంది. కుదిరె సాగర్ కూడా వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నాడు. కాగా అవినాష్ తల్లిదండ్రులకు ఒక్కడే కొడుకు, ఒక కూతురు. వీరిది నిరుపేద కుటుంబం కాగా, తండ్రి పనిచేయలేని స్థితిలో ఉండగా, ఆ ఇంటికి అవినాష్ మాత్రమే ఆధారం. ఒక్కగానొక్క మృతిచెందడంతో ఆ తల్లిదండ్రులను ఓదార్చడం ఎవరితరం కావడం లేదు. ఇంతటి ప్రమాదానికి గల కారణాలు ఇప్పటికీ తెలియరాలేదు. మృతుడి తండ్రి నల్లపు తిరుపతి ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ డ్రైవర్ సురేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఉమాసాగర్ తెలిపారు. ఘటనకు గల పూర్తి వివరాలు పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది.

హెడ్ రెగ్యులేటర్ వద్ద కుళ్లిన మృతదేహం

చొప్పదండి: రెవెల్లి హెడ్ రెగ్యులేటర్ వద్ద గల కాకతీయ కాలువలో కుళ్లిపోయిన మృతదేహం గుర్తించినట్లు ఎస్ఐ గొల్లపల్లి అనూష తెలిపారు. కాకతీయ కాలువ వద్ద లష్కర్‌గా పని చేసే కనకయ్య అస్థిపంజరం రూపంలో ఉన్న మృతదేహం గుర్తించాడు. కార్యదర్శి అనిల్ ద్వారా పోలీసులకు సమాచారమందించారు. మృతదేహం కుళ్లి గుర్తుపట్టేలా లేదని, మృతుడి వయస్సు 40- 50 సంవత్సరాల మధ్య ఉంటుందని తెలిపారు. ఒంటిపై నలుపు ప్యాంట్ ఉందని, మిస్సింగ్ అనుమానాలుంటే పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

కరీంనగర్ క్రైం: కరీంనగర్‌లోని భగత్‌నగర్‌కు చెందిన కాసం రాఘవేందర్‌రెడ్డి ఓ డెయిరీ ఫాంలో పని చేస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం పని ముగించుకొని, ఇంటికి వచ్చాడు. బయటకు వెళ్లి వస్తానని కుటుంబసభ్యులకు చెప్పి, బైక్‌పై వెళ్లాడు. కానీ, తిరిగి రాలేదు. అదేరోజు రాత్రి రాంనగర్‌లో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో అతని తలకు బలమైన గాయాలయ్యాయి. దీంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య సౌమ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

గంజాయి విక్రేత అరెస్టు

ఇల్లంతకుంట: ముస్కానిపేటలో మహ్మద్ అల్ఫాద్ గంజాయి విక్రయించేందుకు యత్నిస్తుండగా ఎస్సై అరెస్ట్ చేశారని సీఐ మొగిలి శనివారం తెలిపారు. అతడి నుంచి 110 గ్రా. గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


రాజేశంనాయక్ (ఫైల్)

ధర్మారం(ధర్మపురి): ఎర్రగుంటలపల్లి బస్టాండ్ సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బంజేరుపల్లి తండా బి- గ్రామానికి చెందిన భూక్య రాజేశం నాయక్(35) అక్కడికక్కడే మరణించాడు. రాజేశంనాయక్ తన ట్రాక్టర్ రిపేరు కోసం ధర్మారం వచ్చాడు. మరమ్మతు పూర్తి కాకపోవడంతో మోటార్ సైకిల్‌పై ఇంటికి బయలు దేరాడు. మార్గమధ్యంలోని ఎర్రగుంటపల్లి బస్టాండ్ సమీపంలో కరీంనగర్ నుంచి వస్తున్న డీసీఎం వ్యాన్ అతివేగంగా ఢీకొంది. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన రాజేశం నాయక్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్సై లక్ష్మణ్ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య సంధ్యతోపాటు ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఉద్యోగినికి వేధింపులు?

జగిత్యాల: జగిత్యాల జిల్లాలో ఓ ప్రభుత్వ విభాగంలో పని చేసే మహిళ ఉద్యోగిని అందులో పనిచేస్తున్న వారు లైంగికంగా వేధిస్తున్నారంటూ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. సదరు మహిళ ఉద్యోగి ఉన్నతాధికారికి ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. కాగా, 15 రోజుల క్రితం సైతం ఓ శాఖలో మహిళా ఉద్యోగులను వేధింపులకు గురిచేయగా వారు సైతం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

యువకుడిపై పోక్సో కేసు

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): ఓ యువతిని ప్రేమ పేరిట మోసం చేసిన రాకేశ్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఇదే వ్యక్తిపై 2022లోనూ పోక్సో కేసు నమోదైందన్నారు.

మహిళ అదృశ్యం

బోయినపల్లి: జగ్గారావుపల్లి గ్రామానికి చెందిన దొంతరవేని ఎల్లవ్వ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పృథ్వీధర్ శనివారం తెలిపారు. ఎల్లవ్వ ఈనెల 22న ఎల్లవ్వ అదృశ్యమైనట్లు ఆమె కుమారుడు దొంతరవేని కనుకరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.